క్లుప్తంగా

వైభవంగా గణపతికి పుష్పోత్సవం



మాచవరంలో గణపతికి సమర్పించిన స్వీట్లు

అంబాజీపేట: మాచవరం గ్రామపంచాయతీ సమీపాన వేంచేసిన సిద్ధి, బుద్ధి శ్రీ యువ గణపతి స్వామి వారి పుష్పోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ కొడమంచిలి వెంకట కృష్ణ నాగేశ్వరరావు శర్మ బ్రహ్మత్వాన తాళం రామకృష్ణ, గోపికృష్ణ దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి పుష్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 9న గణపతి స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి పుష్పోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులు వివిధ రకాల స్వీట్లు స్వామికి సమర్పించారు. కార్యక్రమంలో దంపతులతో పాటు అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నవమి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రావులపాలెం: స్థానిక సీతారామచంద్రస్వామి, షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలకు బుధవారం పందిరిరాట వేశారు. ఆలయ అర్చకుడు పాణింగపల్లి జనార్దన కేశవమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించగా గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పందిరిరాటను పాతారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, సీఆర్‌సీ ఓల్డేజ్ హోం అధ్యక్షుడు సత్తి రామకృష్ణారెడ్డి, పోతంశెట్టి కనికిరెడ్డి, కర్రి సత్తిరెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

డ్రెయిన్‌లో పూడికతీత



ముక్తేశ్వరం సెంటర్‌లో డ్రెయిన్‌లో పూడికను తొలగిస్తున్న పొక్లెయిన్

అయినవిల్లి: ముక్తేశ్వరంలోని తొత్తరమూడి వైపు డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపట్టారు. ఈ డ్రెయిన్ పూడికతో ఉండటంతో గృహ అవసరాల కోసం ఉపయోగించిన మురుగునీరు ఎటు పారక పోవడంతో రోడ్డు పైకి చేరుతుంది. దీంతో ప్రయాణికులు ఈ నీటితో ఇబ్బందులు పడుతున్నారు. రోగాలు ప్రబలుతాయని భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు ఈ నీటిని మళ్లించేందుకు పొక్లెయిన్ సాయంతో డ్రెయిన్‌లో పూడిక తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

చిన్నారులకు టీకాలు



జొన్నాడలో చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. వైద్యాధికారులు ఆధ్వర్యంలో సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు.

వ్యక్తి అరెస్ట్

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన సజ్జా సత్తిబాబు అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. వివరాల ప్రకారం 2016లో ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన సజ్జా కృష్ణవేణిని ఆమె భర్త, అత్తమామలు, ఆడపడుచు, బావ వేధించగా ఆమె భరించలేక తన పుట్టింటికి వెళ్లి బాత్రూంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని అంటించుకుని మృతి చెందింది. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. వారిలో ఒక ముద్దాయి సజ్జా సత్తిబాబు 2016లో ఉపాధి నిమిత్తం గల్ఫ్ పారిపోగా అప్పటి నుంచి అక్కడే ఉన్నారు. ఇటీవల ర్యాలి గ్రామానికి రావడంతో సత్తిబాబును అరెస్టు చేసి కొత్తపేట కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అంతర పంటలతో ఆదాయం భళా..

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టమూ తక్కువే

అంబాజీపేట: అనాదిగా కోనసీమ రైతాంగం కొబ్బరి, వరి లాంటి సంప్రదాయ పంటలనే సాగు చేస్తున్నారు. అదే సమయంలో తమకు ఆదాయాన్ని తక్కువ సమయంలో అందించే అంతర పంటలపై దృష్టి సారించడం లేదు. రోజురోజుకీ వ్యవసాయం కష్టతరం అవుతుండటం, నిర్వహణ వ్యయాలు పెరిగిపోవడంతో రైతుల దృష్టి ప్రత్యామ్నాయ పంటలపై మళ్లింది. దీనిలో భాగంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచించిన అంతర పంటలను సాగు చేస్తూ అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో ఒకే సారి ఏడు అంతర పంటలను పండించి శాస్త్రవేత్తలు కృతకృత్యులయ్యారు. దీనిని ఆదర్శంగా తీసుకుని కొంత మంది అభ్యుదయ రైతులు తమ పొలాల్లో కొబ్బరి, అరటి, కోకో, కంద, అనాస, మిరియం, తమలపాకు, కూరగాయ పాదులు, పూలసాగు తదితర పంటలను సాగు చేస్తూ అంతర పంటల ద్వారా అధిక ఆదాయం సాధిస్తున్నారు. వాణిజ్య పంటల రైతులు మార్కెట్‌లో ఫలసాయం అందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలను కోల్పోవటం, లేకపోతే గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా నియోజకవర్గంలోని పి.గన్నవరం 1200, మామిడికుదురు 1000, అయినవిల్లి మండలంలో 2000, అంబాజీపేట మండలాల్లో 1500 ఎకరాల్లో అంతర పంటల సాగు చేస్తున్నారు.



అంబాజీపేటలో కొబ్బరితోటలో అంతర పంటగా సాగు చేస్తున్న అరటి, పసుపు, అనాస, కోకో

అంతర పంటలుగా ఎన్నో రకాలు

కొబ్బరితోటల్లో వాణిజ్య పంటలైన అరటి, కోకో, పోక, కంద, పసుపు, బత్తాయి, కూరపాదులతో పాటు పూల సాగును అంతర పంటలుగా వేస్తున్నారు. వాణిజ్య పంటలు వేసిన నాటి నుంచి ఫలసాయం అందడానికి 9 నుంచి 11 నెలల సమయం పట్టడంతో రైతులు అప్పటి వరకు ఏదో విధంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది.

ఎంతో మేలు



అంతర పంటలతో భూములకు, రైతులకు ఎంతో మేలని వ్యవసాయాధికారి తెలిపారు. ఈ పంట వల్ల పంటల్లో వచ్చే తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుందన్నారు. మేలు చేసే మిత్ర పురుగులు క్రిమి కీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. అలాగే ఈ పంటల నుంచి వచ్చే పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుంది. వాణిజ్య పంటలో ఏదో ఒకటి అంతర పంట వేస్తారు. కొబ్బరిలో కోకో, పోక, కూరపాదులు, బత్తాయి తదితర అంతర పంటగా వేస్తున్నారు. అంతర పంటలు సాగు చేయడం వల్ల లాభాలు ఆర్జిస్తున్నారు.

– ఎం.దిలీప్‌కుమార్, ఉద్యాన అధికారి, అంబాజీపేట

భార్య చికిత్స నిమిత్తం భర్తకు సాయం



ఎం.లోహిదాసుకు సాయం అందజేస్తున్న యూత్ సభ్యులు

సఖినేటిపల్లి: మండలంలోని వీవీ మెరక వెలంకాయకోడు చానల్‌గట్టుకు చెందిన ఎం.రాజ్యలక్ష్మికి చికిత్స నిమిత్తం సదరు ప్రాంతానికి చెందిన యూత్ బుధవారం రూ.25 వేలు సాయం పంపిణీ చేసింది. రాజ్యలక్ష్మి అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ఆమె భర్త ఎం.లోహిదాసుకు పై మొత్తాన్ని వారు అందజేశారు.

రహదారి ఏర్పాటుపై డీపీవో పరిశీలన

మామిడికుదురు: మొగలికుదురు శివారు ప్రాంతంలో నూతనంగా రోడ్డు నిర్మించాలంటూ స్థానికులు గత కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయంపై ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రభుత్వానికి లేఖ రాశారు. గ్రామ పంచాయతీ కూడా రోడ్డు నిర్మించాలని కోరుతూ తీర్మానం చేసింది. ఈ నేపథ్యంలో డ్వామా పీడీ, ఇన్‌చార్జి డీపీవో డి.మధుసూదనరావు బుధవారం ఇక్కడి పరిస్థితిని పరిశీలించారు. రైతులతో పాటు స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ జి.శివరామకృష్ణ, స్థానిక సర్పంచ్ కడి అరుణకుమారి, ఎంపీటీసీ కొప్పిశెట్టి దుర్గాపార్వతి, పంచాయతీ కార్యదర్శి ఎవీఎస్‌వీ ప్రసాద్ ఉన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ ఫిర్యాదుపై విచారణ

అంబాజీపేట: కె.పెదపూడిలో సబ్ సెంటర్ నిర్వహించడంలో హెల్త్ సూపర్ వైజర్ ఎస్.మధుబాబు విధులకు ఆటంకం కలిగిస్తూ, మానసికంగా వేధిస్తున్నాడంటూ ఎంఎల్‌హెచ్‌పీ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.దుర్గారావు దొర తెలిపారు. ముక్కామల పీహెచ్‌సీని బుధవారం ఆయన పరిశీలించి విచారణ చేపట్టారు. హెల్త్ సూపర్‌వైజర్ విధులు, నిర్వహణ, ప్రవర్తన తదితర అంశాలను వైద్యాధికారులు ఎ.ఇంద్రావతి, జీవీ గీతాంజలి, వైద్య సిబ్బందిలను అడిగి తెలుసుకున్నారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని దుర్గారావుదొర తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



అంబాజీపేటలో ఎస్‌ఎన్‌ఎం కళాశాల వద్ద ఇంటర్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

అంబాజీపేట: పుల్లేటికుర్రు ఏవీఎస్ జూనియర్ కళాశాల, అంబాజీపేట ఎస్‌ఎన్‌ఎం కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పుల్లేటికుర్రు ఏవీఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షకు 274 మంది విద్యార్థులకు 232 మంది హాజరయ్యారు. అంబాజీపేట ఎస్‌ఎన్‌ఎం కళాశాలలో 122 మందికి 113 మందికి హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ టి.మంగతాయారు, ఎస్సై ఎ.చైతన్యకుమార్ పరిశీలించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో 285 మందికి 275 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాల సెంటర్‌లో 342 మందికి 307 మంది హాజరయ్యారు. రావులపాలెం సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వి.మణికుమార్ బందోబస్తు నిర్వహించారు.

రావులపాలెంలో..

రావులపాలెం: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ సంవత్సర పరీక్షలు జరిగాయి. స్థానిక జూనియర్ కళాశాల సెంటర్‌లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ పరీక్షలు జరిగాయి. ఈ సెంటర్‌లో జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు స్థానిక సత్యసాయి కళాశాల విద్యార్థులు కలిపి మొత్తంగా 459 మందికి గాను, 47 మంది గైర్హాజరు కాగా 412 పరీక్షకు హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ టి.గంగావతి తెలిపారు.



మామిడికుదురులో ఇంటర్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

మామిడికుదురులో..

మామిడికుదురు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు మామిడికుదురులోని రెండు పరీక్ష కేంద్రాల్లో బుధవారం ప్రశాంతంగా జరిగాయి. 572 మంది విద్యార్థులకు గాను 561 మంది పరీక్షకు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు 9 దాటిన తరువాత పరీక్షకు హాజరైనప్పటికీ వారిని అనుమతించారు. చీఫ్ సూపరింటెండెంట్ ఎఫ్.కనకరాజు పర్యవేక్షణలో డీవోలు జి.శ్రీనివాసరావు, జె.రాజబాబుల ఆధ్వర్యంలో ఈ పరీక్షలు జరిగాయి.

ఆలమూరులో..

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ప్రథమ సంవత్సర ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. నాలుగు కళాశాలలకు చెందిన 336 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కావలసి ఉండగా పది మంది గైర్హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాదరెడ్డి, డీఓ డి.సత్యనారాయణమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో పోలీసుల బృందం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు బొబ్బా జయశ్రీ జెడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యార్థులు, ప్రైవేటు విద్యాసంస్థలైన అంగర సిద్ధార్థ జూనియర్ కళాశాల, చెముడులంక ఈశ్వరీ విద్యాలయం, మహిళ కళాశాల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

పొలంబడిలో రైతులకు సూచనలు



పలివెల పొలంబడిలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ వెంకటరామారావు



విశ్వేశ్వరాయపురంలో నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమం

కొత్తపేట: ప్రస్తుత రబీ సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ స్థానిక సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పలివెలలో రెండు ప్రాంతాల్లో వ్యవసాయ అధికారులు వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ వెంకటరామారావు పలువురు రైతులకు చెందిన వ్యవసాయ క్షేత్రాల్లో తిరిగి వరి పంటను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇకపై వరి సాగులో తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పంట పాలు పోసుకునే దశలో ఉన్నందున, నీరు ఉండేలా చూసుకోవాలన్నారు. అగ్గితెగులు, కాండం కుళ్లు తెగులు రాకుండా సూడోమోనాస్, వేపనూనె పిచికారీ చేయాలని సూచించారు. వాటిని 50 శాతం రాయితీపై సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సీహెచ్ సాగర్, ఎస్.సురేఖ పాల్గొన్నారు.

విశ్వేశ్వరాయపురంలో..

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యాన రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పొలం పరిసరాల విశ్లేషణ, మిత్ర, శత్రుపురుగులపై అవగాహన, ప్రకృతి వ్యవసాయంపైన అధికారులు అవగాహన కల్పించారు. ఆత్మ జిల్లా పీడీ జ్యోతిర్మయి, జిల్లా రిసోర్స్ సెంటర్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్, వ్యవసాయ అధికారి మనోహర్, ఏఏపీ చైర్మన్ నల్లి శివకుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.రాకేష్, వీఏఏ థెరిసా, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్లకోమా నివారణపై సదస్సు

రాజోలు: ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా రాజోలు కమ్యూనిటీ ఆస్పత్రిలో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్లకోమా నివారణకు చేపట్టాల్సిన చర్యలను ఆప్తమాలజిస్ట్ కె.సృజన వివరించారు. గ్లకోమా తీవ్రస్థాయికి చేరి అంధత్వానికి దారి తీస్తుందన్నారు. 40 ఏళ్లు వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ ఒకటి నుంచి మూడేళ్లకోసారి కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పారి సూర్యనారాయణ తదిరులు పాల్గొన్నారు.



రాజోలు సదస్సులో మాట్లాడుతున్న సృజన

క్షయ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన సదస్సు

సఖినేటిపల్లి: ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా బుధవారం అంతర్వేది దేవస్థానం సచివాలయం వద్ద క్షయ వ్యాధి నివారణ చర్యలపై ఆరోగ్య శాఖ అవగాహన సదస్సు నిర్వహించింది. హెల్త్ మేళాలో రాజోలు టీబీ యూనిట్ ఇన్‌చార్జ్ వైద్యాధికారి యూనుస్ మాట్లాడుతూ, ఒక వారం పైబడి దగ్గు, జ్వరం రావడం, దగ్గినప్పుడు ఛాతీలో నొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు గలవారు ప్రతి సచివాలయంలో గల హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రంలో కళ్లె నమూనా ఇచ్చి వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలన్నారు. ఒక వేళ టీబీ నిర్ధారణ అయితే పేషెంట్లు శరీర బరువును బట్టి ఇంటివద్దనే ట్రీట్‌మెంట్‌కు చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, హెల్త్ సూపర్‌వైజర్ పీఎల్ఎన్ స్వామి, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ యు.హరిప్రసాద్, సీహెచ్‌వో ఎం.మౌనిక, ఏఎన్ఎం కె.అనితకుమారి పాల్గొన్నారు.

వైద్యురాలి ఆత్మహత్యాయత్నం

అల్లిపురం: ప్రియుడు మోసం చేశాడని ఓ వైద్యురాలు.. ప్రియుడి ఇంటి వద్ద నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ విజయకుమార్ తెలిపిన వివరాలివీ.. కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన ఎస్.దేవి వైద్యురాలు. మ్యాట్రిమోనియల్ యాప్ ద్వారా ఈఎస్ఐ ఆస్పత్రిలో పని చేస్తున్న ఆరిలోవ ప్రాంతానికి చెందిన ప్రేమ్‌చంద్ అనే చిన్నపిల్లల డాక్టర్‌తో పరిచయం పెంచుకుంది. ఇద్దరు పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఆమె డాబా గార్డెన్స్‌లోని ప్రేమ్‌చంద్ ఇంటికి వెళ్లింది. అప్పటికే ఆయనకు పెళ్లి జరిగినట్లు తెలుసుకుంది. దీంతో ఆమె నిద్రమాత్రలు అధిక మొత్తంలో మింగేయడంతో అపస్మారక స్థితిలోకి చేరుకుంది. స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్.ఐ విజయకుమార్ తన సిబ్బందితో కలసి అక్కడకు చేరుకుని ఆమెను కేజీహెచ్‌కు తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స చేయడంతో కోలుకుంది. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న ఆమె తండ్రి రాజమహేంద్రవరం నుంచి నగరానికి చేరుకున్నారు. కేజీహెచ్ నుంచి డిశ్చార్జి అయిన తర్వాత బుధవారం ఉదయం టూటౌన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గృహ సారథులే గ్రామాభివృద్ధికి వారధులు

మామిడికుదురు: గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లే గ్రామాభివృద్ధికి వారధులని జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు ఎండీ షరీఫ్, ఐటీ ఇన్‌చార్జిలు కుసుమ శ్రీధర్, సూరిశెట్టి బాబిలు అన్నారు. మగటపల్లి, కొమరాడ గ్రామాల్లోని గృహ సారథులు, కన్వీనర్లకు శిక్షణ సమావేశాన్ని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, జేసీఎస్ మండల కన్వీనర్ సిర్రా మణికుమార్‌ల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గృహ సారథులు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరును అవగాహన చేసుకుని సమయపాలనతో జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి నిర్వహించాలన్నారు. సీఎం జగన్ రూపొందించిన సంక్షేమ పథకాలను నిబద్ధతతో విధులు నిర్వహించాలని గృహ సారథులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి, బండారు సూర్యచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



మగటపల్లిలో గృహసారథులకు కిట్‌లు అందిస్తున్న నాయకులు



ఊడిమూడిలో గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న పార్టీ నాయకులు

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి

పి.గన్నవరం: సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, పార్టీ యూత్ నాయకుడు కొండేటి వికాస్ బాబు అన్నారు. మండలంలోని ఊడిమూడిలో గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 18 నుంచి జరుగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. గృహ సారథులకు కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు నూకపెయ్యి ప్రసన్న కుమార్, తోలేటి బంగారునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, పార్టీ నాయకులు సాధనాల రమేష్, పందిరి పూర్ణచంద్రరావు, కొల్లు రాంబాబు, రాణి శ్రీధర్, దేశిరాజు సీతారామయ్య, చిట్టాల ఆర్యశ్రీను, నేలపూడి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత, పరిమాణం విషయంలో మోసపోవద్దు



కొత్తపేట డిగ్రీ కళాశాలలో ఆదిత్య కిరణ్‌ను సత్కరిస్తున్న అరుణ్‌కుమార్

కొత్తపేట: వినియోగదారులు మార్కెట్‌లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు ఆ వస్తువుల నాణ్యత, పరిమాణం, ధర విషయంలో మోసపోకుండా స్పృహ కలిగి ఉండాలని జిల్లా జిల్లా కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఇన్‌చార్జ్, ప్రైస్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సత్తిరాజు ఆదిత్యకిరణ్ సూచించారు. బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ఎకనామిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆదిత్యకిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా సేవలందిస్తున్న ఆదిత్యకిరణ్‌ను కళాశాల తరఫున సత్కరించారు. కార్యక్రమంలో కొత్తపేట, అంబాజీపేట మండలాల వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

అంబాజీపేట: బాల్యంలో వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ బాల్య వివాహాలను అరికట్టాలని డాక్టర్ వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఆర్ఎంబీ గంగాధర్ అన్నారు. అంబాజీపేట క్రాంతి పథం కార్యాలయం వద్ద మహిళా శక్తి సంఘ సభ్యులకు బాల్య వివాహాలు, స్కూల్ డ్రాప్ అవుట్స్, బాల కార్మికులు, మహిళలపై అత్యాచారాలు, మహిళల్లో రక్తహీనత, పిల్లల్లో పోషకాహార లోపాలపై మండల సమాఖ్య అధ్యక్షురాలు కామాడి రాజేశ్వరి అధ్యక్షతన అవగాహన సదస్సును, ర్యాలీని బుధవారం నిర్వహించారు. స్థానిక కార్యాలయం నుండి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాడిపై కేసు

రావులపాలెం: తమపై కొందరు దాడి చేసి గాయపర్చినట్టు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.వెంకటరమణ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని కొమరాజులంక గ్రామానికి చెందిన యార్లగడ్డ గణేష్, యార్లగడ్డ సత్తిపండు లంక భూముల్లో మట్టిని అక్రమంగా తవ్వుతున్నారని అదే గ్రామానికి చెందిన గుర్రాల పుల్లేశ్వరరావు, గుర్రాల సత్యనారాయణ 14వ తేదీ రాత్రి గణేష్, సత్తిపండుల ఇంటికి వెళ్లి అడిగారు. ఈ నేపథ్యంలో గణేష్, సత్తిపండు తమపై దాడి చేసి గాయపరిచినట్టు పుల్లేశ్వరరావు, సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.